# పిలుపు

**- ఉప్పల అనంత సుధాకర్**

'ఒరే నందూ' చిన్నా పుట్టినరోజు ఫంక్షన్‌కు ఇంకా పదిహేను రోజులే ఉంది. మీ స్నేహితులందరినీ ఇంకా ఎప్పుడు పిలుస్తావు?' అడిగాడు రాజ్ తన కొడుకుని ఆ రోజు సాయంత్రం.

'పనుల హడావుడిలో పడి ఈ విషయం మరచి పోయా. ఇప్పుడే ఆ పని చేస్తా' అంటూ, తన ఆఫీస్ రూంలోకి వెళ్ళాడు ఆనంద్.

సరిగ్గా ఇరవై నిమిషాలు గడిచాయి.

'డాడ్, 75 మంది స్నేహితులను పిలిచా. 64 కుటుంబాలు వస్తున్నాయి' చెప్పాడు ఆనంద్, బయటకు వస్తూ.

ఇరవై నిమిషాల్లో ఇదెలా సాధ్యం? అడిగాడు రాజ్, నందూ వివరించాడు, తను చేసిన పని.

ఆశ్చర్యపోయాడు రాజ్. ఆశ్చర్యం అనేకంటే షాక్ అంటే బాగుంటుందేమో!

ఇది పిలుపు కాదు మాయాజాలం! మనుషుల మధ్య తరిగి పోతున్న విలువలకు తార్కాణం! నిట్టూర్చాడు రాజ్. గతంలో జరిగిన సంఘటనలు గుర్తుకు వచ్చాయి.

పాతికేళ్ళక్రితం,

తన పెద్దకొడుకు నామకరణానికి, శుభ పత్రికలు అచ్చు వేయించాడు. వాటికి పసుపు కుంకుమ బొట్లు పెట్టి, చక్కగా అడ్రస్‌లు వ్రాసి, బంధువులు, స్నేహితుల ఇళ్ళకు వెళ్ళి ఆప్యాయతతో ఆహ్వానించారు. అన్ని చోట్లకు తనొక్కడే వెళ్ళడం కుదరదు కనుక, తను, తమ్ముళ్ళు, నాన్నగారు తలా ఒక వైపు వెళ్ళి పత్రికలు ఇచ్చివచ్చారు. కార్యక్రమానికి ఒకరోజు ముందు అందరూ వచ్చారు, ప్రక్క ఊళ్ళో ఉన్న అక్కా, బావలు తప్ప. వాళ్ళు రాక పోవడానికి అసలు కారణం కొద్ది సేపు తర్వాత తెలిసింది. తనే స్వయంగా వెళ్ళి పిలవలేదన్న కోపం అని. వెంటనే వెళ్ళి, క్షమాపణలు, చెప్పి బ్రతిమాలి తీసుకు వచ్చేసరికి తలప్రాణం తోకకు వచ్చింది.

ఇరవై ఏళ్ళక్రితం,

గృహప్రవేశం - ఆహ్వాన పత్రికలు, అడ్రస్‌లు, పసుపు కుంకుమలు అంతా అలాగే. ఈ సారి మాత్రం తను స్వయానా వెళ్ళలేదు. పిలిచిన వాళ్ళందరూ వచ్చారు. 'కాలం మారిపోయింది... ఏం చేస్తాం', బావగారు గొణుక్కోవడం, విని విననట్లే ఊరుకొన్నాడు తను.

పదేళ్ళ క్రితం,

తనుక్రొత్తగా ప్రారంభిస్తున్న బిజినెస్ ప్రారంభోత్సవం. స్నేహితులకు, ముఖ్యులకు, బంధువులందరికీ ఇన్విటేషన్స్ పోస్ట్‌లో పంపించాము. అందరకూ ఫోన్‌చేసి 'మీరంతా తప్పనిసరిగా రావాలి. సమయంలేనందున, స్వయంగా వచ్చి అహ్వానించలేకపోతున్నాము. అన్యధా భావించ వద్దు.' అంటూ చెప్పడం తనింకా మరిచిపోలేదు.

ఆ తర్వాత మాతృదేశం వదలడం, అమెరికాలో అడుగుపెట్టడం, మరోక్రొత్త జీవితం ప్రారంభించడం చకచకా జరిగిపోయాయి.

నాలుగేళ్ళక్రితం,

నందూ పెళ్ళి సందడి. పద్దతులన్నీ మారిపొయ్యాయి. అంతా కాంట్రాక్ట్ మయం. పెళ్ళిమండపం ఓ కాంట్రాక్ట్, భోజనాలు మరో కాంట్రాక్ట్. అలంకరణకు మరొకటి. ఆహ్వానాలకూ కాంట్రాక్ట్ ఉందన్నవిషయం విని మరింత ఆశ్చర్యం. పిలవాల్సినావాళ్ళ పేర్లు, చిరునామాలు చెబితే చాలట. పత్రికలు అచ్చువేయించటం, అందజేయడం, పిలవడం అంతా కాంట్రాక్ట్‌కంపెనీ చూసుకొంటుందట. తనకు అస్సలే నచ్చలేదు, అయినా తప్పలేదు. అప్పటికీ మనసొప్పక అయినవాళ్ళందరికీ స్వయానా ఆహ్వానించడం, తన కొడుకుతో చీవాట్లు తినడం, మరో మర్చిపోలేని సంఘటన.

మూడేళ్ళ క్రితం ఓ చిన్ననాటి మిత్రుడు ఫోన్ చేసాడు. వాళ్ళ అబ్బాయి గ్రాడ్యుయేషన్ ఉందని మమ్మల్నందరినీ రమ్మని ఆహ్వానించాడు. eVite పంపిస్తున్నాని, అందులో అన్నివివరాలు ఉంటాయని చెప్పాడు. కార్డ్ ప్రింట్ చేయడం, పోస్ట్‌చేయడం వగైరా అంతా తగ్గిపోయింది. సరేలే, ఈ లెక్కన కొన్ని చెట్లను రక్షిస్తున్నాము... అనుకొన్నా అప్పుడు.

రెండేళ్ళ క్రితం, ఈ మెయిల్ చెక్ చేస్తుంటే ఓ ఇన్విటేషన్, మరో స్నేహితుడి దగ్గరినుండి. వాళ్ళ అమ్మాయిపెళ్ళి ఆహ్వానం. ఈ సారి ఫోన్‌లో పిలవడం మాటే లేదు. ఓ వారం తర్వాత అతను, నేను ఓ స్నేహితుల ఇంట్లో కలిసాం. తను ఇన్విటేషన్ పంపిన విషయం ఊసేలేదు!

ఓ సంవత్సరం క్రితం, మరో 'పిలుపు'. ఈ సారి eVite లాంటిదేమీలేదు. మా ఇంట్లో ఫలానా కార్యక్రమం ఉంది. మీరెందరు వస్తారో, రిప్లయ్ పంపమని.

ఆర్నెళ్ళ క్రితం, మరో మహానుభావుడు, నా క్యాలండర్‌లో ఎంట్రీ చేసాడు... ఇన్విటేషన్ లేదు, ఈ మెయిల్ లేదు.. ఫోన్‌కాల్ మాటేలేదు. *Contd Page..118*

మన సాహిత్యంతో తగుమాత్రమైనా పరిచయం లేకపోతే వివిధ భారతీయభాషల్లోని సాహిత్యాన్ని అవగాహన చేసుకోవటం చాలా కష్టం. ప్రాచీన-నవీన సాహిత్య పఠనం అలవాటు లేకుంటే మనప్రాంతాల గురించిన స్థలపురాణాలు, దివ్యక్షేత్రాలు, పుణ్యతీర్థాల మహత్యాన్ని గురించి తెలియదు. కొన్ని పదబంధాలు, జాతీయాలు, ఉపమానాలు, కథలు, పొడుపుకథలు, వాటి అర్థాలు తెలియవు. సమగ్రత రాదు.

పత్రికల్లో వచ్చే కవితల్లో, కథల్లో, నాటికల్లో, కార్టూన్లలో ఇంకా మనం రోజూ వాడే సామెతలు, జాతీయాలు, నానుడులు ఇవన్నీ మన సాహిత్యం, అందులోనూ పురాణకథలు తెలియకపోతే అసలు అర్థమే కావు. ఉదా: ధృతరాష్ట్రకౌగిలి, రావాణకాష్టం, లక్ష్మణ రేఖ' ఇలాంటి పదాలకు అర్థాలు తెలియాలంటే ఆయా పురాణాలు తెలియాలి. అప్పుడే వాటి మీద ఆత్మీయత కలుగుతుంది. అదే నేటివిటీ అంటే.

ఇంతటి ప్రాధమ్యాన్ని కలిగిన తెలుగును నేర్చుకోవటం, చదవటం రేపటిపౌరులకు ఎంతైనా అవసరం. మనం మన మూలాలు, వాటి విలువలూ తెలుసుకోవాలంటే ప్రతివారు మాతృభాషను చక్కగా నేర్చుకోవలసిందే. నేటి ఉరుకులు-పరుగుల జీవనవిధానం పిల్లలను పుస్తకాలు చదవటం అనే అలవాటుకు దూరంచేస్తోంది. కాని, మనిషి ఆకాశంలో విహరించినా, భూమే అతనికి ఆధారమైనట్టుగా ఎవరెవరు ఎంత చదువులు చదివినా, ఏయే విద్యలు నేర్చినా మాతృభాషను కూడా తప్పనిసరిగా నేర్చుకోవాలి. లేకపోతే నేల విడిచిన సామే అవుతుంది. పక్క ఇంటి ఆంటి ప్రేమతో పిండివంటలు పెట్టినా, అవి అమ్మ అప్యాయంగా పెట్టే కమ్మని వంటకాలు కావుకదా.

కాబట్టి మనందరం మన పిల్లలకు చక్కని తెలుగును నేర్పటం, మంచి పుస్తకాలను చదివింప చేయటం, ముఖ్యంగా ఇంటివాతావరణాన్ని తెలుగులో ఉంచడం చేయాలి. అప్పుడే వారికి సరైన ఆలోచనా రీతి, చక్కని భావాలు, వ్యవహారిక దృక్పథం అలవాటు అవుతాయి. పంచతంత్రకథల్లో కేవలం కథలు వినటం వల్లనే రాజకుమారులు లోకజ్ఞానాన్ని పొందారని మనం చదువుకున్నాం కదా. పిల్లలకు మాతృభాషలోని కథలు, గేయాలు వినిపించడం, చదివించటం, వారిచేత చెప్పించడం చేస్తుంటే తెలుగులోని పదాలు, అర్థాలు, సమానార్థకాలు, నానార్థాలు, జాతీయాలు, నానుడులు, సామెతలు అన్ని వారు తెలుసుకుంటారు. ఎంజాయ్ చేస్తారు. అమృతతుల్యమైన తెలుగుభాష మృతసదృశం కాకుండా రేపటికీ, ఎప్పటికీ, తరతరాలా నిలిచి ఉంటుంది. ****

---

*Contd from Page… 114*

**పిలుపు**

పెళ్ళిల్లు, పుట్టినరోజులు, స్వీట్ సిక్స్‌టీన్‌లు, అంత తఱుచుగా వచ్చే కార్యక్రమాలు కావు. అందుకై కొంత సమయం వెచ్చించడం, సన్నిహితులను ఆప్యాయంగా - ఆహ్వానించడంలో తప్పేమిటో తలబద్దలు కొట్టుకున్నా అర్థం కాలేదు.

రాజ్ మనసులో మాట ఆనంద్‌కు తెలిసినట్లుంది. 'అదంతే డాడ్, నీకు అర్థం కాదు.' అన్న మాటలకు ఈ లోకంలోకి వచ్చాడు రాజ్.

ఇంతకూ, వాళ్ళ అబ్బాయి చేసిన ఘన కార్యం, - ఆనంద్ మాటల్లో,

'వెరీ సింపుల్! tweets పంపాను, రివర్స్ confirmation tweets వచ్చాయి. అవి count చేసి నీకు చెప్పా!'****



**మీ ఇంటి గేటు**

***- తమ్మినేని యదుకుల భూషణ్***

తడిసి రాలిన ఆకులు
తడుముతాయి పాదాలను
మీ ఇంటిగేటు మీద నిలిచిన నీరు
చేయిని తడుపుతోంది హాయిగా

వాన వెలిసింది
కానీ, మబ్బులు అలాగే
అడుగుల చప్పుడు వినిపిస్తుందా?
అడగాలని లేదు ఏమీ ...